


నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
EVENING EDITION
పేజీలు: 02
PM

## పంత్ వస్తున్నాడు..!

ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, దాదాపు ఏడాది పాటు ఆటకు దూరమైన రిషబ్ పంత్ 2024 ఐపీఎల్‌తో పునరాగమనం చేసే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఈ వికెట్‌కీపర్ బ్యాటర్ వచ్చే ఏడాది ఐపీఎల్‌లో దిల్లీ క్యాపిటల్స్‌కు నాయకత్వం వహిస్తాడని ఆ ఫ్రాంఛైజీ మేనేజ్‌మెంట్ ధ్రువీకరించింది. ప్రస్తుతం ఎన్‌సీఏలో పునరావాసంలో ఉన్న పంత్.. ఫిబ్రవరి చివరికి పూర్తి ఫిట్‌నెస్ సాధిస్తాడని భావిస్తున్నట్లు ఓ దిల్లీ అధికారి చెప్పాడు. ప్రమాదం కారణంగా పంత్ గత ఐపీఎల్‌లో ఆడలేదు.







## 70,000 ఎగువన ప్రారంభమైన సెన్సెక్స్..
# 21,000 పైన నిఫ్టీ

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మంగళవారం లాభాలతో ప్రారంభమయ్యాయి. ఉదయం 9:27 గంటల సమయంలో సెన్సెక్స్ 79 పాయింట్లు లాభపడి 70,008 దగ్గర ట్రేడవుతోంది. నిఫ్టీ 31 పాయింట్లు పెరిగి 21,028 వద్ద కొనసాగుతోంది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ రూ.83.35 దగ్గర ప్రారంభమైంది. సెన్సెక్స్-30 సూచీలో ఐటీసీ, టాటా స్టీల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఏషియన్ పెయింట్స్, నెస్లే ఇండియా, ఎంఅండ్ఎం, టెక్ మహీంద్రా, ఎస్‌బీఐ, కోటక్ మహీంద్రా బ్యాంక్, హెచ్‌యూఎల్ షేర్లు లాభాల్లో ఉన్నాయి. ఎల్అండ్‌టీ, ఇన్ఫోసిస్, భారతీ ఎయిర్‌టెల్, టైటన్, మారుతీ, ఎన్‌టీపీసీ షేర్లు నష్టాల్లో కొనసాగుతున్నాయి. అమెరికా మార్కెట్లు సోమవారం లాభాలతో ముగిశాయి. నవంబరు ద్రవ్యోల్బణ గణాంకాలు దిగొస్తాయనే సంకేతాలు అక్కడి సూచీలకు దన్నుగా నిలిచాయి. మరోవైపు ఫెడరల్ రిజర్వ్ సమావేశాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. వడ్డీరేట్లలో పెంపు ఉండకపోవచ్చుననే సంకేతాలు బలంగా వినిపిస్తున్నాయి. అలాగే ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో రేట్ల కోతపై ఫెడ్ నిర్ణయం వెలువరించే అవకాశం ఉందని ఆశిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే అక్కడి సూచీలు రాణించాయి. అక్కడి నుంచి సంకేతాలు అందుకున్న ఆసియా పసిఫిక్ మార్కెట్లు నేడు లాభాల్లో ట్రేడవుతున్నాయి.



## ఇక నుంచి మంగళ, శుక్రవారాల్లో 'ప్రజావాణి'
### ప్రజాదర్బారు పేరు మార్పు

ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు ఉద్దేశించిన ప్రజాదర్బార్ కార్యక్రమం పేరును ప్రజావాణిగా మార్చారు. ఈ మేరకు పేరును మార్చుతున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం ఒక కార్యక్రమంలో ప్రకటించారు. హైదరాబాద్‌లోని జ్యోతిబా ఫులె ప్రజాభవన్‌లో ప్రస్తుతం నిర్వహిస్తున్న కార్యక్రమంలో మార్పులు చేసినట్లు పేర్కొన్నారు. ఇకపై మంగళ, శుక్రవారాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు 'ప్రజావాణి'లో భాగంగా దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతుందని స్పష్టం చేశారు. "ఉదయం 10 గంటల లోపు ప్రజాభవన్‌కు చేరుకున్న వారికి ప్రాధాన్యమివ్వాలి. దివ్యాంగులు, మహిళలకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేయాలి. ప్రజావాణికి వచ్చేవారి సౌకర్యార్థం తాగునీరు, ఇతర మౌలిక సౌకర్యాలు కల్పించాలి. భద్రతా సిబ్బంది ప్రజాదర్బార్‌కు వచ్చిన ప్రజలకు అన్ని విధాల సహకరించాలి" అని అధికార యంత్రాంగానికి సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

## డీజీపీ అంజనీకుమార్‌పై సస్పెన్షన్ ఎత్తివేత



తెలంగాణలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఐపీఎస్ అధికారి అంజనీకుమార్‌పై కేంద్ర ఎన్నికల సంఘం సస్పెన్షన్‌ను ఎత్తివేసింది. అయితే, అంజనీకుమార్ విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న సీఈసీ.. సస్పెన్షన్‌ను ఎత్తివేస్తున్నట్టు తెలిపింది. కాగా, అంజనీకుమార్ తన సస్పెన్షన్‌పై సీఈసీని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల కౌంటింగ్ రోజున తాను ఉద్దేశపూర్వకంగా ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించలేదని తెలిపారు. ఎన్నికల రోజున సీఎం రేవంత్ రెడ్డి పిలిస్తేనే తాను ఆయన ఇంటికి వెళ్లినట్టు అంజనీకుమార్ స్పష్టం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కావని ఆయన చెప్పారు. దీంతో, ఆయన విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న సీఈసీ.. సస్పెన్షన్‌ను ఎత్తివేస్తున్నట్టు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొంది.

## 500కే గ్యాస్ సిలిండర్‌ను
# 100 రోజుల్లో అమలుచేస్తాం
### మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి



తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారెంటీలలో 'రూ. 500కే గ్యాస్ సిలిండర్' కూడా ఒకటి. ఇప్పటికే రెండు గ్యారెంటీలను అమలు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం.. రూ. 500కే గ్యాస్ సిలిండర్‌ను 100 రోజుల్లో అమలుచేస్తాం అని తెలిపింది. ఈ మేరకు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. నేడు పౌరసరఫరాలశాఖపై ఉత్తమ్ సమీక్ష నిర్వహించారు. ధాన్యం సేకరణ, మిల్లింగ్ సామర్థ్యం, బియ్యం నాణ్యతపై అధికారులు వివరించారు. అనంతరం ఉత్తమ్ మీడియాతో మాట్లాడారు. గత పాలకుల వల్ల పౌరసరఫరాలశాఖలో తప్పిదాలు జరిగాయని, ఆర్థిక పరిస్థితి ఆందోళనకరంగా ఉందన్నారు. 'సివిల్ సప్లై శాఖ రాష్ట్రంలో ముఖ్యమైన శాఖ. రైతుల నుంచి ప్రొక్యూర్మెంట్ చేసే శాఖ. గ్యాస్ సిలిండర్ రూ. 500, ప్యాడి ప్రొక్యూర్మెంట్‌లో రూ. 500 పెంచేది వంద రోజుల్లో అమలు చేస్తాం. 5 కిలోల బియ్యం కేంద్రం ఇస్తుంది. రాష్ట్రం ఇచ్చే కిలో బియ్యం క్వాలిటీ పెరగాలి. ఇప్పటివరకు ఒక కిలోనే ప్రతీ మనిషికి బీఆర్ఎస్ ఇచ్చింది. లబ్ధిదారుల నుంచి పీడీఎస్ రైస్ డైవర్ట్ అయ్యింది. లబ్ధిదారులకు తినగలిగే రైస్ ఇవ్వాలి. 2 కోట్ల 80 లక్షల మంది లబ్ధిదారులున్నారు. ప్రొక్యూర్మెంట్‌కు సివిల్ సప్లై అన్ని చర్యలు తీసుకోవాలి' అని మంత్రి ఉత్తమ్‌కుమార్ అన్నారు. 'రైతులకు డబ్బులు వెంటనే అందే విధంగా చర్యలు తీసుకోవాలి. గత ప్రభుత్వం ఈ శాఖ, ఆర్థిక శాఖకు సహాయం చేయకపోవడంతో 56 వేల కోట్లు అప్పు చేసింది. సివిల్ సప్లై కార్పొరేషన్ 90 లక్షల మెట్రిక్ టన్నులు. 18వేల కోట్ల విలువైన ప్యాడి రైస్ మిల్లర్ల వద్ద ఉంది. దీనిపై ఏం చేయాలనేది క్యాబినెట్‌లో చర్చిస్తాం. 1.17లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సివిల్ సప్లై వద్ద ఉంది. 11వేల కోట్ల నష్టాల్లో సివిల్ సప్లై కార్పొరేషన్ ఉంది. తొమ్మిదిన్నర ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో లోపాలు ఉన్నాయి. ఉన్న రేషన్ కార్డులో బియ్యం తీసుకున్న వారు 89 శాతం దాటిపోలేదు. కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ ఉంది. సీఎం దృష్టికి ఆ విషయాన్ని తీసుకువెళ్తా. రాష్ట్రంలోని అన్ని శాఖల్లో ఆర్థిక పరిస్థితి బాగోలేదు' అని ఉత్తమ్ చెప్పారు. 'పేద ప్రజలకు ప్రభుత్వం ఇస్తున్న బియ్యం సరఫరా విషయంలో మనం మరింత పారదర్శకంగా ఉండాలి. 1.8 మెట్రిక్ టన్నుల బియ్యం ప్రజలకు ఉచితంగా ఇస్తున్నాం. కానీ ప్రజలు వాటిని ఉపయోగించుకుంటున్నారా? అన్నది మనం గమనించాలి. కిలో 39 రూపాయలు పెట్టి సేకరిస్తున్న బియ్యం ప్రజలకు ఉచితంగా ఇస్తున్నాం. కానీ అవి పేదలు తినకపోతే ఇంత పెద్ద గొప్ప ఉచిత బియ్యం పథకం నిరుపయోగం అవుతుంది. మొక్కుబడిగా కాకుండా లోపాలు ఎక్కడ ఉన్నాయో వెతకాలి. బియ్యం పేదలకు ఎలా ఉపయోగకరమైన పథకంగా ఉంటుందో మనం అధ్యయనం చేయాలి. రాష్ట్రంలో బియ్యం లబ్ధిదారుల నుంచి రాండం చెక్ చెయ్యాలి. ప్రజల నుంచి సమాచారం సేకరించాలి. పేదలకు ఇస్తున్న బియ్యం వారు తినే విదంగా ఉండాలి తప్ప వేరే విదంగా దుర్వినియోగం కావొద్దు' అని మంత్రి ఉత్తమ్ సమావేశంలో చెప్పుకొచ్చారు.




## హైదరాబాద్ సీపీగా
## కొత్త కోట శ్రీనివాస్‌రెడ్డి

తెలంగాణలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టాక రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఐపీఎస్ బదిలీలకు మొదటి సారి శ్రీకారం చుట్టారు. కీలకమైన బాధ్యతల్లో ఉన్న ఐపీఎస్ అధికారుల బదిలీలు జరిగాయి. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ పరిధిలో కమిషనర్లను బదిలీ చేస్తూ రేవంత్ సర్కార్ నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ నూతన సీపీగా కొత్త కోట శ్రీనివాస్‌రెడ్డినియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాచకొండ సీపీగా సుధీర్ బాబు, సైబరాబాద్ సీపీగా అవినాష్ మహంతి నియమితులయ్యారు. అలాగే హైదరాబాద్ పాత సీపీ సందీప్ శాండిల్యాను తెలంగాణ నార్కోటిక్ బ్యూరో డైరక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర, రాచకొండ సీపీ చౌహాన్‌ను డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

## ఆ పులిని చంపేయండి..
# కేరళ ప్రభుత్వం ఆదేశాలు



వయనాడ్ జిల్లాలో అలజడి సృష్టించిన పులిని చంపేయాలంటూ కేరళ ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. వయనాడ్‌కు చెందిన ప్రజీశ్ (36) శనివారం గడ్డి కోయడానికి వెళ్లగా పులి దాడి చేసి చంపేసింది. శరీరంలో కొంత భాగాన్ని తినేసింది. ఆ ఘటన స్థానికంగా తీవ్ర అలజడి సృష్టించింది. ఘటనాస్థలం నుంచి మృతదేహాన్ని తరలించొద్దంటూ ఆ ప్రాంత ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే అటవీ శాఖ ఆ పులిని అంతమొందించాలని ఆదేశాలు జారీ చేసింది. ఆ పులి మనుషులను చంపి తినే రకమా? కాదా? అనేది ధ్రువీకరించుకోవాలని స్పష్టంచేసింది.



## ఢిల్లీని వణికిస్తున్న చలి

దేశ రాజధాని ఢిల్లీని చలి వణికిస్తోంది. గత నాలుగు రోజుల్లో ఢిల్లీలో కనిష్ట ఉష్ణోగ్రత మూడు డిగ్రీలకు పైగా పడిపోయింది. ఈ సీజన్‌లో సోమవారం ఉదయం అత్యంత చలి పెరిగింది. ఢిల్లీలోని స్టాండర్డ్ అబ్జర్వేటరీ సఫ్దర్‌జంగ్‌లో కనిష్ట ఉష్ణోగ్రత సాధారణం కంటే మూడు డిగ్రీలు తక్కువగా నమోదైంది. ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్‌లో సోమవారం కనిష్ట ఉష్ణోగ్రత 6.5 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. ఇది సాధారణం కంటే మూడు డిగ్రీల సెల్సియస్ తక్కువ.

## గవర్నర్ రాజ్ భవన్‌కు బాంబు బెదిరింపు



అది గవర్నర్ నివాసం రాజ్ భవన్.. అర్థరాత్రి సరిగ్గా 12 గంటల సమయంలో.. నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ.. NIAకు ఓ గుర్తు తెలియని.. నెంబర్ కనిపించని ఫోన్ వచ్చింది.. రాజ్ భవన్ లో బాంబు పెట్టాం.. అది ఏ క్షణమైనా.. ఎప్పుడైనా పేలిపోతుంది అని ఆ ఆగంతకుడు చెప్పాడు.. అప్రమత్తం అయిన ఎన్ఐఏ అధికారులు.. ఈ వివరాలను సిటీ పోలీసులకు ఇచ్చారు. కర్ణాటక రాష్ట్రంలో జరిగిన ఈ ఘటన అర్థరాత్రి.. పోలీసులను పరుగులు పెట్టించింది. 2023, డిసెంబర్ 12వ తేదీ వస్తున్న సమయంలో.. ఎన్ఐఏ నుంచి వచ్చిన సమాచారంతో బెంగళూరు సిటీ పోలీసులు రాజ్ భవన్ మొత్తాన్ని జల్లెడ పట్టారు. డాగ్ స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్ లతో తనిఖీలు చేశారు. మూడు గంటలు.. రాజ్ భవన్ మొత్తం తనిఖీల తర్వాత.. ఎలాంటి బాంబు లేదని డిక్లేర్ చేశారు. ఎవరో కావాలని ఈ ఫోన్ కాల్ చేసినట్లు భావిస్తున్నారు బెంగళూరు పోలీసులు. ప్రస్తుతం NIAకు వచ్చిన ఫోన్ కాల్ వివరాలు సేకరించే పనిలో ఉన్నారు పోలీసులు.

## మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డికి మరో షాక్



బీఆర్ఎస్ సీనియర్ నేత, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డికి మరో షాక్ తగిలింది. తమ వద్ద తీసుకున్న రూ. 20 కోట్ల రుణంతో పాటు వడ్డీ కలిపి మొత్తం రూ. 45 కోట్లు చెల్లించాలంటూ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ బ్యాంక్ అధికారులు జీవన్ రెడ్డికి నోటీసులు జారీ చేశారు. ఆర్మూర్ లోని జీవన్ రెడ్డి ఇంటికి అధికారులు నోటీసులు అంటించడం చర్చనీయాంశంగా మారింది. మాల్ నిర్మాణం కోసం 2017లో జీవన్ రెడ్డి (అప్పుడు ఎమ్మెల్యేగా ఉన్నారు) ఆయన భార్య పేరిట లోన్ తీసుకున్నాడు. ఆ సమయంలో జీవన్ రెడ్డితో పాటు మరో నలుగురు వ్యక్తులు షూరిటీలు పెట్టారు. తీసుకున్న రుణం డబ్బులు, వడ్డీ చెల్లించకపోవడంతో తాజాగా జీవన్ రెడ్డికి స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ బ్యాంక్ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఇప్పటికే చాలాసార్లు నోటీసులు పంపించినా జీవన్ రెడ్డి స్పందించలేదని తెలుస్తోంది. నోటీసుల అంశం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.




## ఆస్ట్రేలియా
## కొత్త ఇమ్మిగ్రేషన్ పాలసీ

విద్యార్థులు, తక్కువ నైపుణ్యం ఉన్న ఉద్యోగులకు జారీ చేసే వీసాల నిబంధనలు మరింత కఠినతరం చేయాలని ఆస్ట్రేలియా ప్రభుత్వం నిర్ణయించింది. తమ నూతన వలస విధానం ఐదు అంశాల ఆధారంగా రూపొందించామని వెల్లడించింది. ఆస్ట్రేలియన్ల జీవన ప్రమాణాలను పెంపొందించడం, సుహృద్భావ పని వాతావరణం కల్పించడం, అంతర్జాతీయ సంబంధాలు బలోపేతం చేసుకోవడం వీటిలో ముఖ్యమైనవని తెలిపింది. దరఖాస్తులు, సంబంధిత పత్రాల్లో ఏ కొంచెం తేడా ఉన్నా వీసా నిరాకరించే అవకాశం ఉంటుంది.

## 20 కి.మీ. ప్రయాణం కోసం..
## 200 కి.మీ. నుంచి హెలికాప్టరు!



కర్నూలులో ఈనెల 19న నిర్వహించే సీఎం జగన్ సభకు విమానాశ్రయం నుంచి సభా వేదిక వరకు చేరుకోవడానికి హెలికాప్టరును రప్పిస్తుండడం చర్చనీయాంశంగా మారింది. వేదిక ఏర్పాటు చేస్తున్న ప్రాంతం నుంచి 20 కి.మీ. దూరంలోనే ఓర్వకల్లు విమానాశ్రయం ఉండగా, దానిని ఆనుకునే జాతీయ రహదారి ఉంది. మధ్యలో సుమారు 4 కి.మీ. మినహా 4 వరుసల జాతీయ రహదారి పైనే సాఫీగా ప్రయాణించవచ్చు. ఆ నాలుగు కి.మీ. మేర కూడా ఎలాంటి గుంతలు లేవు. అయినా విమానాశ్రయం నుంచి సభావేదిక వద్దకు వచ్చేందుకు హెలికాప్టర్ వినియోగించాలని నిర్ణయించారు. దానిని హైదరాబాద్ లేదా విజయవాడ నుంచి రప్పించాలని భావిస్తున్నారు. ఎటు నుంచి వచ్చినా అది కర్నూలుకు చేరాలంటే సుమారు 200 కి.మీ. ఎగిరి రాక తప్పని పరిస్థితి. రహదారులు సరిగా లేకపోతేనో, సభావేదిక దూరంగా ఉన్నప్పుడో హెలికాప్టర్ వినియోగించుకోవడాన్ని ఎవరూ ఆక్షేపించరు. కానీ కేవలం 20 కి.మీ. దూరం కోసం 200 కి.మీ. నుంచి హెలికాప్టర్ రప్పిస్తుండడం చర్చనీయాంశమైంది.

## ఐపీఎల్ వేలానికి
# 333మంది క్రికెటర్లు




ఈ నెల 19న జరిగే ఐపీఎల్ (IPL) వేలంలో మొత్తం 333 మంది అమ్మకానికి ఉంటారు. ఖాళీలు 77 మాత్రమే. హర్షల్ పటేల్, శార్దూల్ ఠాకూర్, ఉమేశ్ యాదవ్ కనీస ధర రూ.2 కోట్లు ఉన్న ఆటగాళ్ల జాబితాలో ఉన్నారు. రెండేళ్ల కింద జరిగిన వేలంలో హర్షల్ రూ.10.75 కోట్లకు అమ్ముడుపోయాడు. ఐపీఎల్ పాలకవర్గం మొత్తం 1166 మందితో కూడిన జాబితాను ఫ్రాంఛైజీలకు అందించింది. ఆటగాళ్లపై ఫ్రాంఛైజీల ఆసక్తి ఆధారంగా జాబితాను 333కు కుదించింది. ఇందులో 214 మంది భారతీయులు, 119 మంది విదేశీయులు, అసోసియేట్ దేశాల నుంచి ఇద్దరు ఉన్నారు. వేలంలో ఖర్చు పెట్టడానికి ఫ్రాంఛైజీల వద్ద మొత్తం రూ.262.95 కోట్లు ఉన్నాయి. మొత్తం 77 మంది నుంచి గరిష్టంగా 30 మంది విదేశీ క్రికెటర్లను జట్లు కొనుక్కోవచ్చు. ఆసీస్ ఆటగాళ్లు కమిన్స్, ట్రావిస్ హెడ్, ఇంగ్లిస్, మిచెల్ స్టార్క్‌లకు మంచి డిమాండ్ ఉండనుంది. వీళ్ల కనీస ధర రూ.2 కోట్లు. న్యూజిలాండ్ స్టార్ రచిన్ రవీంద్ర తన కనీస ధరను రూ.50 లక్షలుగా నిర్ణయించుకున్నాడు.

నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM



## అప్పుల్లో టాప్-5లో తెలుగు రాష్ట్రాలు..

గ్యారెంటీ అప్పుల రాష్ట్రాల జాబితాలో తెలంగాణ, ఏపీ టాప్ 5లో ఉన్నాయి. గత ఏడాది మార్చి నాటికి రూ. 1.71 లక్షల కోట్ల రుణంతో యూపీ మొదటి స్థానంలో ఉంది. రూ.1.35లక్షల కోట్లతో తెలంగాణ రెండోస్థానంలో నిలవగా, రూ.1.17లక్షల కోట్లతో ఏపీ మూడో స్థానంలో ఉంది. కాగా వివిధ కార్పొరేషన్ల పేరిట తెలంగాణ రుణాలను తీసుకుందని, రాష్ట్ర బడ్జెట్ అప్పు రూ.3.14 లక్షల కోట్లుగా ఉన్నట్లు ఆర్బీఐ పేర్కొంది.



## బిడ్డ మృతదేహాన్ని అట్ట పెట్టెలో ఇచ్చిన మార్చురీ సిబ్బంది

చెన్నై పులియంతోపు కనికాపురం ప్రాంతానికి చెందిన మన్సూర్ భార్య సోనియా ప్రసవ వేదనతో ఇంట్లోనే ప్రసవించింది. పుట్టిన వెంటనే పాప చనిపోయింది. చిన్నారిని పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించి పోస్టుమార్టంకు తరలించారు. చిన్నారి మృతదేహాన్ని ఇచ్చేందుకు మార్చురీ సిబ్బంది లంచం అడగడంతో మృతదేహాన్ని గుడ్డలో చుట్టకుండా అట్టపెట్టెలో పెట్టి ఇచ్చారు. ఇందుకు సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.



## ఆహార కల్తీలో హైదరాబాద్ టాప్

హైదరాబాద్ నగరంలోనే ఆహార పదార్థాల కల్తీ అధికంగా ఉందని నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో(ఎన్సీఆర్బీ) నివేదికలో వెల్లడించింది. ఆహార కల్తీలో హైదరాబాద్ సిటీ దేశంలోనే టాప్ లో నిలిచింది. 2022లో దేశంలోని 19 ప్రధాన నగరాల్లో మొత్తం 291 ఆహార కల్తీ కేసులు నమోదు కాగా, అందులో 246 కేసులు హైదరాబాద్‌లోనే నమోదయ్యాయి. దేశంలోని 19 నగరాల్లో నమోదైన కేసుల్లో 84 శాతం కేసులు హైదరాబాద్‌లోనే నమోదు కావడం గమనార్హం.



## ఏపీలోనే నిరుద్యోగం అత్యధికం: నారా లోకేశ్

దేశంలోని అన్ని రాష్ట్రాలతో పోలిస్తే ఏపీలోనే నిరుద్యోగం అత్యధికం టీడీపీ నేత నారా లోకేశ్ చెప్పారు. నిరుద్యోగిత రేటు 24 శాతానికి పెరగడం దురదృష్టకరమని అన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలతో వర్ధిల్లిన రాష్ట్రాన్ని సీఎం జగన్ నాశనం చేశారని మండిపడ్డారు. యువత నిరాశ, నిస్పృహలతో కొట్టుమిట్టాడుతోందన్నారు. అన్ని అర్హతలు ఉన్న ఏపీ యువత భవిత మెరుగుపడాలని ఆకాంక్షించారు.

## జూలో మనిషిని తినేసిన పులి

పాకిస్థాన్‌లోని బహవల్‌పూర్‌లో జంతు ప్రదర్శనశాలలో దారుణం జరిగింది. పులి నోటిలో షూస్ ఉన్నాయి. పక్కనే తిన్న మనిషి అయిన వ్యక్తి మృతదేహం లభ్యమైంది. గత బుధవారం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బుధవారం ఉదయం జూ సిబ్బంది అన్ని ఎన్‌క్లోజర్‌లను తనిఖీ చేస్తుండగా పులి పంజా ముద్రను గుర్తించారు. పులి నోటిలో ఎలా చిక్కుకుందనే కోణంలో విచారణ జరుపుతున్నట్లు అధికారులు తెలిపారు.



## పోలీసులు కొట్టారని ఆత్మహత్యకు యత్నించిన దళిత యువకుడు మృతి

ప్రకాశం జిల్లా యర్రగొండపాలెంలో పోలీసులు కొట్టారనే మన స్తాపంతో ఆత్మహత్యకు యత్నించిన దళిత యువకుడు మోజెస్ మృతి చెందాడు. ఈనెల 6న (బుధవారం) పోలీస్ స్టేషన్ ఆవరణలో ఒంటిపై పెట్రోల్ పోసుకుని అతడు నిప్పంటించుకున్నాడు. తీవ్రంగా గాయ పడిన మోజెస్‌కు మార్కాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం గుంటూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ మోజెస్ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు.

## 18 ఏళ్ల తర్వాత తలకాయ నుంచి బుల్లెట్ తీశారు

ఓ వ్యక్తికి 18 ఏళ్ల క్రితం తలలో ఇరుక్కున్న బుల్లెట్ ను తీశారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వ్యక్తిని బతికించారు డాక్టర్లు. ఇన్నాళ్లు బతుకుపై ఆశలు వదులుకున్న వ్యక్తిలో మళ్లీ ఆశలు చిగురింపజేశారు.

అసలింతకు ఏం జరిగింది..?

యెమెన్ కు చెందిన సలేహ్ అనే వ్యక్తికి ఇద్దరు పిల్లలు. అతడికి ఆరుగురు సోదరులు, ముగ్గురు సోదరీమణులు. చెవులు వినపడవు. 18 ఏళ్లుగా సలేహ్ తలలో మూడు సెంటీ మీటర్ల పొడవున్న బుల్లెట్ ఇరుక్కుపోయి ఉంది. దాంతో అతడు చాలా ఇబ్బందులు పడ్డాడు. తరచూ చెవి నుంచి రక్తం కారడం, చెవులు సరిగా వినపడకపోవడం వంటి సమ స్యలతో బాధపడేవాడు. సలేహ్.. తల్లిదండ్రులు వ్యవసాయం చేస్తుంటారు. ఇంటికి దగ్గరలోని పొలంలో ఉల్లిపాయలు, టమోటాలు, బంగా ళాదుంపలు, వెల్లుల్లి, క్యారెట్లు పండిస్తుం డేవారు. సలేహ్.. చురుకైన పిల్లవాడు. మొక్కలకు నీరు పోయడం.. ఎరువు వేయడం వంటి పనులు (10ఏళ్ల వయసులో) చేసేవాడు. తన తండ్రికి తరచుగా సహాయం చేసేవాడు. జీవితం సాఫీగా సాగుతున్న సమయంలో విధి వెక్కిరించింది. ఒక షాపు నుంచి తిరిగి ఇంటికి వెళ్తుండగా.. రెండు వర్గాలు గొడవ పడుతుండడం గమనించాడు. సలేహ్. అదే సమయంలో ఉన్నట్టుండి ఒక బుల్లెట్ వేగంగా దూసుకొచ్చి సలేహ్ తలలో ఇరుక్కుంది. వెంటనే అతడు కింద కుప్ప కూలాడు. దగ్గరలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు తల్లిదండ్రులు. డాక్టర్లు ప్రాథమిక చికిత్స అందించారు. కానీ.. తలలో ఇరుక్కున్న బుల్లెట్ ను తీయలేక పోయారు. అది అలాగే తలలో ఉండి పోయింది. ఇక అప్పటి నుంచి సలేహ్ కు



కష్టాలు మొదలయ్యాయి. అతడి బాధను చూసి తల్లిదండ్రులు కూడా ఏడవని రోజు లేదు. మెల్లగా ఆరోగ్యం కూడా చెడిపోవడం ప్రారంభించింది. బుల్లెట్ చెవి గుండా దూసు కుపోవడంతో తరచూ ఇన్ఫెక్షన్లు వస్తుండేవి. ఎన్నో ఆస్పత్రులకు వెళ్లిన ఫలితం లేకుండా పోయింది. తలలో ఇరుక్కున బుల్లెట్ తీస్తారని సలేహ్ కు ఫ్రెండ్స్ ద్వారా బెంగళూరులోని ఆస్టర్ ఆస్పత్రి గురించి తెలిసింది. వెంటనే బెంగ ళూరుకు వెళ్లి ఆస్టర్ ఆస్పత్రిలో జాయిన్ అయ్యాడు. అక్కడి డాక్టర్లు అన్ని రకాల పరీక్షలు చేశారు. అప్పడే వారికి ఇదొక సవాల్ గా మారింది. ఎలాగైనా సలేహ్ తలలో ఇరుక్కున బుల్లెట్ ను తీయాలని డాక్టర్లు నిర్ణయించు కున్నారు. అదే సమయంలో అతడి ప్రాణాలకు ప్రమాదం జరగకుండా.. అన్ని రకాల జాగ్రత్తలు తీసుకున్నారు. ముందస్తు ప్లాన్ ప్రకారం.. అన్ని రకాల వైద్య పరికరాను అందుబాటులో ఉంచుకున్నారు డాక్టర్లు. లెటెస్ట్ వైద్య పరికరాల ద్వారా తలలో బుల్లెట్ ఏ ప్లేసులో ఇరుక్కుందో గుర్తించారు. వెంటనే డాక్టర్లు సలేహ్ కు ఆప రేషన్ చేసి, బుల్లెట్ ను తీసేశారు. దీంతో 18 ఏళ్లుగా తలలో ఇరుక్కున బుల్లెట్ ను తీయడంతో సలేహ్ కు ప్రాణం లేచివచ్చి నట్లైంది. ఇప్పుడు చెవులు కూడా వినపడు తున్నాయి. చెవి నుంచి చీము కరడం ఆగి పోయింది. సర్జరీ సక్సెస్ అయిన తర్వాత సలేహ్ తిరిగి తన కుటుంబ సభ్యులతో కలిసి యెమెన్ కు వెళ్లాడు. ప్రస్తుతం అతడు ఆరో గ్యంగానే ఉన్నాడు. ఇంగ్లీషు, ఫ్రెంచ్ భాషాల్లో డిగ్రీ చదువుతున్నాడు.




## పుతిన్ ప్రత్యర్థి నవానీ.. జైలులో మిస్సింగ్..!

రష్యా అధ్యక్షుడు పుతిన్ విధానాలను తీవ్రస్థాయిలో విమర్శించే నాయకుడు అలెక్సీ నవానీ జైలు నుంచి అదృశ్యమయ్యారు..! తాము ఆయన్ను సంప్రదించలేకపోతున్నామని నవానీ తరఫు న్యాయవాదులు వెల్లడించారు. ఇప్పుడు ఆయన జాడపై ఎలాంటి సమాచారం అందుబాటులో లేదని తెలిపారు. వచ్చే ఏడాది రష్యాలో అధ్యక్ష ఎన్నికలు జరిపేందుకు రంగం సిద్ధమైన తరుణంలో ఈ పరిణామం వెలుగులోకి వచ్చింది. రష్యాలో అవినీతి వ్యతిరేక ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, విపక్ష నేత అలెక్సీ నవానీకి ఈ ఆగస్టులో 19 ఏళ్ల జైలు శిక్ష పడింది. ఫౌండేషన్ కార్యకలాపాల విషయంలో నమోదైన కేసులో స్థానిక కోర్టు ఈ శిక్ష విధించింది. తర్వాత ఆయన్ను రష్యా రాజధాని మాస్కోకు 150 మైళ్ల దూరంలో ఉన్న పీనల్ కాలనీ(జైలు)లో ఉంచారని తెలుస్తోంది. నవానీని సంప్రదించాలని ప్రయత్నించగా.. తమకు పీనల్ కాలనీ నుంచి ఎలాంటి స్పందనారాలేదని ఆయన తరఫు న్యాయవాదులు సోషల్‌మీడియా వేదికగా వెల్ల డించారు. దాదాపు ఆరురోజులుగా ఆయన జాడ తెలియడం లేదని పేర్కొన్నారు. 'గతవారం నవానీ తన జైలుగదిలో అనారో గ్యానికి గురయ్యారు. ఈ సమయం నుంచే ఆయన కని పించడం లేదు' అని ఆందోళన వ్యక్తం చేశారు. ఆయనకు జైలులో కనీస వసతులు కూడా అందడం లేదని ఆరోపించారు.




## "హను మాన్" ట్రైలర్ రిలీజ్ డేట్ ఖరారు.!

ప్రస్తుతం మన టాలీవుడ్ నుంచి రాబోతున్న కొన్ని అవైటెడ్ ఇంట్రెస్టింగ్ ప్రాజెక్ట్ లలో యంగ్ దర్శకుడు ప్రశాంత్ వర్మ అలాగే యంగ్ హీరో తేజ సజ్జ కాంబి నేషన్ లో తెరకెక్కిస్తున్న సూపర్ హీరో బ్యాక్ డ్రాప్ చిత్రం "హను మాన్" కూడా ఒకటి. మరి అనౌన్సమెంట్ తోనే ఒక భారీ చిత్రాన్ని చూస్తామని ఫీల్ ని ఇచ్చిన మేకర్స్ ఇక నెక్స్ట్ టీజర్ తో అయితే అంచనాలు ఒక్క సారిగా మరింత లెవెల్లోకి వెళ్లాయి. మరి ఈ తర్వాత మేకర్స్ సినిమాని అయితే క్వాలిటీ కోసం ఆలస్యం చేశారు. దీనితో నెక్స్ట్ ఈ సినిమా నుంచి ట్రైలర్ కోసం ఆసక్తిగా ఎదురు చూస్తూ వస్తున్నారు. ఆ విజువల్స్ అండ్ యాక్షన్ ఏ రీతిలో ఉంటాయనే ఆసక్తి మూవీ లవర్స్ మెయిన్ గా మన తెలుగు ఆడియెన్స్ లో ఉంది. ఇక ఫైనల్ గా అయితే ట్రైలర్ రిలీజ్ పై అప్డేట్ ఇచ్చేసారు. దీనితో ఈ ట్రైలర్ ఈ డిసెంబర్ 19న రిలీజ్ చేస్తు న్నట్టుగా అనౌన్స్ చేశారు. మరి ఈ ట్రైలర్ ఎలా ఉంటుందో అంచనాలు అందుకుంటుందో లేదో తెలియాలి అంటే అప్పటివరకు ఆగాల్సిందే.



## ఆఫ్ఘానిస్థాన్‌ను వణికించిన భారీ భూకంపం

ఆఫ్ఘానిస్థాన్ మరోసారి భూకంపంతో వణికిపోయింది. మంగళవారం ఉదయం 7.35 గంటల సమయంలో బలమైన భూప్రకంపనలు చోటు చేసుకున్నాయి. రిక్టర్ స్కేలుపై భూకంప తీవ్రత 5.2గా నమోదైనట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ వెల్లడించింది. ఒక్కసారిగా భూమి కంపించడంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. ఈ భూకంపం కారణంగా ఆస్తి, ప్రాణ నష్టానికి సంబంధించి ఇప్పటి వరకూ ఎలాంటి సమాచారం లేదు. కాగా, ఇటీవలే కాలంలో ఆఫ్ఘానిస్థాన్‌ను వరుస భూకంపాలు వణి కిస్తున్న విషయం తెలిసిందే. అక్టోబర్‌లో సంభవించిన భూకంపం దేశంలో ఎంతటి విధ్వంసం సృష్టించిందో ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు. పశ్చిమ ప్రాంతంలో సంభవించిన ఈ భూకంపంలో 2 వేల మందికి పైగా ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. వేలాది మంది ప్రజలు తీవ్రంగా గాయపడ్డారు. భూకంపం కారణంగా వేలాది ఇళ్లు నేల మట్టమై ప్రజలు నిరాశ్రయులయ్యారు.

## పాకిస్థాన్ ఆర్మీబేస్‌పై ఆత్మాహుతి దాడి.. 23 మంది మృతి

పాకిస్థాన్‌లో ఉగ్రవాదులు మరోసారి రెచ్చిపోయారు. ఆర్మీయే లక్ష్యంగా ఆత్మాహుతి దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో సుమారు 23 మంది ప్రాణాలు కోల్పోయారు. ఖైబర్ ఫంఖ్తుఖ్వా ప్రావిన్స్ లోని డేరా ఇస్మాయిల్ ఖాన్ జిల్లాలోగల ఆర్మీ బేస్‌పై మంగళవారం తెల్లవారు జామున ఆత్మాహుతి దాడి ఘటన జరిగినట్లు స్థానిక అధికారులు వెల్ల డించారు. ఈ దాడిలో 23 మంది ప్రాణాలు కోల్పోయినట్లు చెప్పారు. ఆత్మాహుతి బాంబర్లు సెక్యూరిటీ కాంపౌండ్‌లోకి చొరబడి ఈ ఘాతు కానికి పాల్పడ్డారు.



## గోపీచంద్ తో ఊర్వశి స్పెషల్ సాంగ్?

యాక్షన్ హీరో గోపీచంద్ హీరోగా దర్శకుడు శ్రీను వైట్ల దర్శకత్వంలో ఓ మూవీ చేసేందుకు సిద్ధం అయిన సంగతి తెలిసిందే. ఐతే, ఈ సినిమాలో ఓ స్పెషల్ సాంగ్ ఉందని ఇప్పటికే వార్తలు వచ్చాయి. తాజాగా బాలీవుడ్ బ్యూటీ ఊర్వశి రౌటెలాతో ఆ స్పెషల్ సాంగ్ ని చేయిస్తున్నారని టాక్ నడుస్తోంది. ఐతే, మేకర్స్ నుంచి ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. మొత్తానికి గోపీచంద్ – శ్రీను వైట్ల నుంచి పవర్ ఫుల్ యాక్షన్ అండ్ ఎమోషనల్ డ్రామా రాబోతుందని తెలుస్తోంది. అలాగే, శ్రీను వైట్ల మార్క్ కామెడీ ఎలిమెంట్స్ కూడా సినిమాలో ఫుల్ గా ఉంటాయట.కాగా ఈ సినిమాలో ఓ స్పెషల్ సాంగ్ ఉందట. బాలీవుడ్ బ్యూటీ ఊర్వశి రౌటెలాతో ఈ ఐటమ్ సాంగ్ ని చేయిస్తే బాగుంటుందని మేకర్స్ ఫీల్ అవుతున్నారు. ఈ మూవీని చిత్రాలయం స్టూడియోస్ సంస్థ పై ప్రొడక్షన్ నెంబర్ వన్ గా వేణు దోనేపూడి ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్నారు. ఈ సినిమాకు సంబంధించి ఇంకా ఇతర నటీనటులు సాంకేతిక నిపుణుల వివ రాలను ప్రకటించాల్సి ఉంది. అన్నట్టు ఈ మూవీకి విశ్వం అనే టైటిల్ ని యూనిట్ పరిశీలసి స్తోందట. స్క్రిప్ట్ కి తగ్గట్లుగా ఈ టైటిల్ సరిపోతుందని అంటున్నారు.